ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# దక్షిణ జనసేనలో లొల్లి

◆ ఇప్పటికే ఎమ్మెల్యే వంశీకృష్ణ, కార్పొరేటర్ సాధిక్ మధ్య వైరం ◆ కొల్లి సింహాచలం చేరికతో ఏం జరిగేనో..?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేనలో లొల్లి తప్పేలా లేదు. వైసిపి నాయకురాలు, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తన అనుచరులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా,కొల్లి ప్రవేశంతో దక్షిణ జనసేనలో, ముఖ్యంగా 39వ వార్డులో విభేదాలు ముదిరే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. అందుకు కారణం లేకపోలేదు. కొల్లి సింహాచలం వైసిపిలో ఉన్నప్పుడు అదే పార్టీలో ఉండే ఈ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసిపికి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో కూడా సాధిక్‌కు విభేదాలు ఉన్నాయి. అంతేకాకుండా అసెంబ్లీ ఎన్నికలలో జనసేన పార్టీ తరుపున టికెట్ పొందాలని ఆయన భావించారు. అయితే అనూహ్యంగా ఎమ్మెల్సీగా ఉండే వంశీకృష్ణ శ్రీనివాస్ వైసిపికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. ఆయన రాకకు కార్పొరేటర్ సాధిక్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. నియోజవర్గానికి సంబంధంలేని వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణంలో పోటీ చేస్తే అంగీకరించేది లేదని, ఆయన ఓటమికి కృషి చేస్తామని పలుమార్లు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి సాధిక్ చెప్పారు. అయితే, అనూహ్యంగా వంశీకృష్ణ శ్రీనివాస్‌కు జనసేన టికెట్ లభించింది. దీంతో కొంతకాలం సాధిక్ అలక వహించారు. అయితే పవన్ కల్యాణ్ జోక్యంతో సాధిక్ వెనక్కు తగ్గారు. ఎన్నికల్లో జనసేన పార్టీ విజయానికి పనిచేశారు. తదుపరి ఎమ్మెల్యేగా నెగ్గిన వంశీకృష్ణ శ్రీనివాస్‌తో ఆయనకు వైరం కొనసాగింది. సాధిక్ ప్రాతినిథ్యం వహిస్తున్న 39వ వార్డులోని ఎండిఎం మున్సిపల్ స్కూలుకు దివీస్ సంస్థ సామాజిక బాధ్యతగా రూ.4.5 లక్షలతో సోలార్ ప్లాంట్‌ను సమకూర్చగా ఇటీవల దీనిని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అయితే అందుకోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంలో వార్డు కార్పొరేటర్, జనసేన నాయకుడు సాధిక్ పేరు లేదు. దీంతో ఆయన ఆ కార్యక్రమాన్ని బహిష్కరించారు. కొద్దిరోజులకే ఎమ్మెల్యే వేసిన శిలాఫలకాన్ని మిగతా 2లో..



కొల్లి సింహాచలంను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్




# ఉపాధి కల్పనకు కృషి

◆ జిల్లాలో ఏడు స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా శిక్షణ
◆ ఇప్పటి వరకూ 24 జాబ్ మేళాలు, మినీ జాబ్ మేళాల నిర్వహణ
◆ 'ప్రజాశక్తి'తో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు






ప్రజాశక్తి - అనకాపల్లి

అర్హులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రయత్నిస్తోందని అనకాపల్లి జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి గోవిందరావు తెలిపారు. అందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ఏడు స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. సర్టిఫికెట్‌తో కూడిన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్టు వెల్లడించారు. సంస్థ అందిస్తున్న కోర్సులు, ప్లేస్‌మెంట్లు తదితర వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**జిల్లాలో స్కిల్ హబ్ సెంటర్స్ ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు ?**

అనకాపల్లి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ఏడు సెంటర్లు నెలకొల్పాం. ప్రధానంగా డిగ్రీ విద్యార్థులకు అకడమిక్, పది నుంచి ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నాన్ అకడమిక్ షార్ట్ టెర్మ్ కోర్సులు, అలాగే ఎంటర్ప్రెన్యూర్‌షిప్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ద్వారా మొత్తం 14 కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నాం.

**ఇంతవరకూ ఎంత మందికి శిక్షణ ఇచ్చారు ? ఎంతమంది ఉపాధి పొందారు ?**

జిల్లా వ్యాప్తంగా నాన్ అకడమిక్‌లో 649 మందికి శిక్షణ ఇచ్చాం. వారిలో 318 మందికి సర్టిఫికెట్లు ఇవ్వగా 229 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి. అలాగే అకడమిక్ ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్స్ ద్వారా 48 కళాశాలల నుంచి 2458 మంది శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరికి ఉన్నతి, వాద్వానీ, నాంది ఫౌండేషన్ వంటి సంస్థల ద్వారా శిక్షణ ఇచ్చాం. యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ మిగతా 2లో..

## లేబర్ కోడ్స్‌పై ఉద్యమించాలి

▶ వార్త 4లో..

## అవకాశమిస్తే అండగా ఉంటా..

▶ వార్త 2లో..

## కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసన

▶ వార్త 5లో..

వసంత ఆత్మహత్య కేసులో..

# నాగేంద్రబాబును శిక్షించాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గోపాలపట్నం సమీపానగల నందమూరి నగర్‌కు చెందిన వసంత ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించిన భర్త నాగేంద్రబాబును కఠినంగా శిక్షించాలని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వసంతకు 11 నెలల క్రితం వివాహం జరిగిందని, తొలి నుంచీ భర్త లైంగికంగా, మానసికంగా వేధిస్తుండేవాడని పేర్కొన్నారు. అతని వికృత చేష్టలు, లైంగిక వేధింపులు తట్టుకోలేక ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. అశ్లీల సినిమాలకు అలవాటు పడిన నాగేంద్రబాబు ఆ విధంగానే ఉండాలని భార్యను వేధించేవాడని పేర్కొన్నారు. మద్యం, మత్తు మందులకు అలవాటు పడి సైకోలా వ్యవహరించేవాడని తెలిపారు. ఇలాంటి సైకోల చేతిలో ప్రతి రోజూ చాలా మంది వసంతలు బలైపోతున్నారన్నారు. విచక్షణ కోల్పోయి నేరాలు పెరిగిపోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. విపరీతంగా మద్యం షాపులకు లైసెన్స్‌లివ్వడం, మత్తు పదార్థాలపై నియంత్రణ లేకపోవడం, అశ్లీల సినిమాలు, పోర్న్ వీడియోలు మార్కెట్లోకి విచ్చలవిడిగా విడుదలవడం మూలంగా ఇటువంటి సైకోలు పెరుగుతున్నారని తెలిపారు. వారికి శిక్షలు కఠినంగా లేకపోవడం, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా తీర్పులు ఇవ్వకపోవడం వల్ల వారంతా పెట్రేగిపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళా రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వర్మ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హోం శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకుని, వసంత కుటుంబానికి న్యాయం చేయాలని, నాగేంద్రబాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకూ తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు.

# ఉత్సాహంగా పింక్ సఖీ శారీ వాక్

◆ రొమ్ము కేన్సర్‌పై అవగాహన ◆ సినీ నటి గౌతమి హాజరు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో రోహిత్ మెమోరియల్ ట్రస్ట్, రౌండ్ టేబుల్ లేడీస్ సర్కిల్ ఇండియా సంయుక్తాధ్వర్యాన విశాఖ బీచ్ రోడ్డులో ఆదివారం ఉదయం తలపెట్టిన పింక్ సఖీ శారీ వాక్ ఉత్సాహభరితంగా సాగింది. మహిళల్లో వచ్చే రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. లైఫ్ అగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త గౌతమి తాడిమళ్ల, విశాఖ నగర మేయర్ హరి వెంకట కుమారి సంయుక్తంగా ఈ వాక్‌ను ప్రారంభించారు. బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి వైఎంసిఎ వరకు నిర్వహించిన ఈ వాక్‌లో విశాఖ నగరానికి చెందిన 2500 మంది మహిళలు పింక్ శారీలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ నటి గౌతమి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే కేన్సర్‌పై అవగాహన పొందడం ద్వారా దానిని నివారించవచ్చునన్నారు. కేన్సర్‌తో జీవితం ముగిసిపోదని తెలిపారు. ఆహార అలవాట్లు, వ్యాయామాలతో బ్రెస్ట్ కేన్సర్‌ను నివారించవచ్చునని, పోరాటం చేస్తే కేన్సర్‌ను జయించడం పెద్ద కష్టమైన పని కాదని అన్నారు.

నగర మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారి నేడు ప్రపంచవ్యాప్తంగా మిగతా 2లో..



పింక్ సఖీ శారీ వాక్‌లో పాల్గొన్న సినీ నటి గౌతమి, మేయర్ హరి వెంకట కుమారి

## మొదటి పేజీ తరువాయి..

### దక్షిణ జనసేనలో లొల్లి

ఎవరో పగలగొట్టారు. స్థానిక కార్పొరేటర్ సాధిక్ పేరు లేకపోవడం వల్ల శిలాఫలకాన్ని ఆయనే ధ్వంసం చేసి ఉంటారని ఎక్కువ మంది భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కార్పొరేషన్ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థిగా పోటీ చేసిన వైసిపి నాయకురాలు కొల్లి సింహాచలంను జనసేన పార్టీలో ఆదివారం చేర్చుకోవడాన్ని సాధిక్ అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. కొల్లి సింహాచలంకు ఈ వార్డులో మంచి పట్టు ఉంది. కార్పొరేటర్‌గా ఆమెపై కేవలం 18 ఓట్ల ఆధిక్యతతో అప్పట్లో సాధిక్ గెలుపొందారు.

**వంశీకృష్ణ మాటలు దేనికి సంకేతం ?**

జనసేన పార్టీలో కొల్లి సింహాచలం చేరిన సందర్భంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో కొల్లి సింహాచలం కార్పొరేటర్‌గా పోటీ చేస్తారని, ఆమె గెలుస్తారని జోస్యం చెప్పారు. అయితే ఏ వార్డు నుంచి ఆమె పోటీ చేస్తారనేది చెప్పలేదు. అంతేకాకుండా జనసేన పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఉంటుందని, కూటమి పథకాలను అందరికీ చేర్చడంలో కొల్లి సింహాచలం, కార్పొరేటర్ సాధిక్ బాధ్యత వహించాలని అన్నారు. సాధిక్, సింహాచలం మాటలు తక్కువ, పని ఎక్కువ అన్నట్టు ఉండాలని పరోక్షంగా సాధిక్‌ను ఉద్దేశించి చెప్పారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే సాధిక్‌కు చెక్ పెట్టేందుకే అతని ప్రత్యర్థి సింహాచలంను జనసేన పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. కొల్లి ప్రవేశంతో జనసేన పార్టీలో, ముఖ్యంగా దక్షిణంలో లొల్లి జరిగే వీలుందంటున్నారు.



పింక్ శారీలు ధరించి నృత్యాలతో సందడి చేస్తున్న మహిళలు

### ఉత్సాహంగా పింక్ సఖీ శారీ వాక్

మానవాళిని మరణం వరకూ తీసుకు వెళ్తోందని అన్నారు. అటువంటి వ్యాధిపై మహిళల్లో అవగాహన కల్పించేందుకు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ కృషి చేస్తోందని తెలిపారు. మహిళా సాధికారత వంటి అంశాలపైనా అందరినీ చైతన్యవంతులను చేస్తోందన్నారు. ట్రస్ట్ యాజమాన్యానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వాక్ అనంతరం ఏర్పాటు చేసిన జుంబా డ్యాన్స్, సరదా కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సిఎంఆర్ గ్రూప్, హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, సంధ్యా మెరైన్స్ సంస్థలు ప్రధాన స్పాన్సర్లుగా వ్యవహరించాయి. కార్యక్రమంలో ఎపి ప్రభుత్వ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి, వరుణ్ గ్రూప్ చైర్మన్ వి.ప్రభు కిషోర్, సెలబ్రిటీ, నటి శిల్పా చక్రవర్తి, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ఎంసిఐ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సిఎమ్‌డి, వైజాగ్ గురుద్వారా సాద్ సంగత్ అధ్యక్షులు డాక్టర్ డిఎస్.ఆనంద్, రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అనంతరామ్ గణపతి, వైస్ చైర్మన్ డాక్టర్ మీనాక్షి అనంతరామ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ (ఆర్‌ఎంటి) గుర్మీత్ కోహ్లి, వికెఎల్‌సి 189 చైర్‌పర్సన్ అభిజ్ఞా గ్రంధి పాల్గొన్నారు.

### ఉపాధి కల్పనకు కృషి

ద్వారా 50 మందికి శిక్షణ ఇచ్చి 49 మందికి సర్టిఫికెట్లు ఇవ్వగా 40 మంది ఉపాధి అవకాశాలు పొందారు.

**ఇంకా ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు ?**

చీఫ్ మినిస్టర్ స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ల ద్వారా ఆర్కిటెక్, కంప్యూటింగ్, గేమ్ డిజైనింగ్, పిసిబి డిజైన్, ఎడబ్ల్యుఎస్ ఇంటర్న్‌షిప్, ఐబిఎం స్కిల్స్ ద్వారా 14 కళాశాలల నుంచి వచ్చిన 580 మందికి శిక్షణ, సర్టిఫికెట్లు అందించాం.

**జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారా ?**

జిల్లాలో ఇంతవరకూ 24 జాబ్ మేళాలు, మినీ జాబ్ మేళాలు నిర్వహించగా 1743 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ప్లేస్‌మెంట్స్ పొందిన వారు రూ.11 వేలు నుంచి రూ.15 వేలు వరకు వేతనం పొందుతున్నారు. ఈ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి.

### నాలా పన్ను బకాయిపడ్డ నేతలపై చర్యలేవీ ?

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో భారీ ఎత్తున నాలా పన్నును ఆ పార్టీ నాయకులు చెల్లించకుండా బకాయి పడ్డారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రెవెన్యూ, జివిఎంసి అధికారులు వైసిపి నేతలకే కొమ్ము కాస్తున్నారన్నారు. వైసిపి మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ పెద్ద ఎత్తున నాలా పన్ను బకాయి పడ్డారన్నారు. నాలా పన్ను కడితే తప్ప జివిఎంసి భవన నిర్మాణ అనుమతులుగానీ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌గానీ ఇవ్వకూడదని, కానీ ఆ నిబంధనలు తుంగలో తొక్కబడ్డాయని తెలిపారు.

### రైతులు ఆందోళన చెందొద్దు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రస్తుతం కూరగాయల పంట సీజన్ అయినందున ఎక్కువ సంఖ్యలో సరుకు దిగుబడి రావడం, తమ తమ పల్లెల్లో తగినంత ధర రాకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నట్లయితే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుల సరుకును నేరుగా తమకు దగ్గరగా వున్న రైతు బజారులో ఆ రోజు ఉన్న ధరకు అమ్ముకోవచ్చని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధమైన పరిస్థితి ఏ రైతుకైనా ఎదురైతే, వెంటనే వారి పల్లెలలో లేదా మండలాలలో అందుబాటులో వున్న ఉద్యానవన శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను కలిసి తగిన వివరాలు అందించాలని సూచించారు. ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు.

# అవకాశమిస్తే అండగా ఉంటా...

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

**ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల గొంతు వినిపించి వారికి అండగా ఉంటానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం నగరం, ఆమదాలవలసలోని పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషి చేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల పిఆర్‌సి సమస్యపైనా, హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా పోరాడుతున్న యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తనను బలపరుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా పనిచేసి, ప్రస్తుతం



ప్రచారం చేపడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

అభ్యర్థులుగా ఉన్న ఇద్దరు ఉపాధ్యాయ సమస్యలను పక్కనపెట్టి అధికార పార్టీ ప్రభుత్వాలతో అంటకాగారని, ఉపాధ్యాయుల హక్కులను తాకట్టు పెట్టి వారి సొంత ప్రయోజనాల కోసమే పని చేశారని గుర్తు చేశారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకున వుతానన్నారు. తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# 15న నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించాలనే సదుద్దేశంతో మార్చి 15న విశాఖలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో ఎఫ్‌టిపిసి ఇండియా సిటిజన్ ఫోర్స్ ఎక్సలెన్స్ జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు పి.రమేష్ బాబు తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అందుకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో విద్య, ఇతర రంగాల్లో ప్రముఖులను గుర్తించి సత్కరించి గౌరవించాలన్న ఉద్దేశంతో తమ సంస్థ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని 80 ఏళ్ల వృద్ధురాలు కేరళలో ప్రతిభ ప్రదర్శించి పోటీల్లో గెలుపొందారని, అటువంటి వారికి గుర్తింపు తీసుకురావడానికి తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు. మీడియా రంగంలో విశేష కృషి చేసిన వారికి కూడా అవార్డు అందజేయనున్నట్టు తెలిపారు. సినీ నటి పాయల్ ముఖర్జీ మాట్లాడుతూ తన సినీ కెరియర్ సౌత్ ఇండస్ట్రీలోనే ప్రారంభమైందని, దక్షిణాది సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని అన్నారు. అందరికీ ఇష్టమైన వైజాగ్‌లో ఈవెంట్ జరగడం ఆనందంగా ఉందన్నారు. ఈ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంస్థ ప్రధాన కార్యదర్శి, సినీ దర్శక నిర్మాత పాకలపాటి విజయవర్మ మాట్లాడుతూ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఉచిత పాస్‌లు కావలసినవారు 6309708177 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## రిమాండ్ ఖైదీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో అనారోగ్యంతో బాధపడుతున్న రిమాండ్ ఖైదీ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పాడేరుకు చెందిన పి.రాజబాబు (47) కొట్లాట కేసులో 2024 నవంబరులో రిమాండ్ ఖైదీగా కేంద్రకారాగారానికి వచ్చాడు. ఆయన గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో వైద్యం పొందుతున్నాడు. ఆదివారం ఉదయం ఆక్సిజన్ లెవెల్స్ పడిపోవడంతో చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు జైలు అధికారులు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కారాగారం పర్యవేక్షణాధికారి మహేష్‌బాబు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

## ప్రత్యేక తరగతులను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస గ్రామపంచాయతీ పరిధి విజయానందపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న ప్రత్యేక తరగతులను విశాఖపట్నం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ బోధనను పరిశీలించారు. ఎస్ఎ-1 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. పరీక్షలకు ఎలా సిద్ధం అవ్వాలో విద్యార్థులకు వివరించారు.

## జ్యూట్ కార్మిక సమస్యలపై.. కార్మిక సంఘాల భేటీ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై స్థానిక కాకాస కార్యాలయంలో ఆదివారం మూడు కార్మిక సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. పిఎఫ్, ఇపిఎఫ్ తదితర సమస్యలను పరిష్కరించాలని సోమవారం పిఎఫ్ కమిషనర్‌ను కలవనున్నట్లు ఆయా కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాకాస ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వర రావు, సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎస్.అచ్చారావు, కోశాధికారి ఎంవి. గురుమూర్తి, ఎస్.రామారావు పాల్గొన్నారు.

## సన్ స్కూల్లో కిడ్స్ కార్నివాల్

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక సన్ స్కూల్లో ఆదివారం కిడ్స్ కార్నివాల్ నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, అధ్యక్షులు లక్ష్మీలావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు

## జింకకు గాయాలు



ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడ కెవిఆర్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఆదివారం జింక గాయాలతో ప్రత్యక్షమైంది. ఎండాడ సమీపంలో అడవుల నుంచి తరుచూ జింకలు బయటకు వచ్చేస్తున్నాయి. ఇటీవల కాలంలో జింకలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఓ జింక బయటకు వచ్చింది. ఈ జింకకు గాయాలు కాగా స్థానికులు దానికి ప్రథమ చికిత్స చేసి జూ అధికారులకు సమాచారం అందించారు. జూ అధికారులు వచ్చి కృష్ణ జింకను జూకు తరలించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జింకలు బయటకు రాకుండా సరైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

# తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షులుగా జె.రామన్న, సెక్రటరీగా కె.శ్రీనివాస్‌చౌదరి, కోశాధికారిగా రాజేష్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వరరావు, ఎంవి.రమణ, చిన్నంనాయుడు, యు.బొంజుబాబు, దయాసాగర్, బి.తౌడన్న, కమిటీ సభ్యులుగా టి.చిన్నబాబు, ఆర్.దుర్గాప్రసాద్, జి.కామేశ్వరరావు, గోపాల బందోపాధ్యాయ, గౌరబ్ వరాన్, ఎ. తవిటయ్య, వి.రామారావు, ఎ.మహదేవ్, హనుమాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తాను అధ్యక్ష పదవి చేపట్టి రెండేళ్లు పూర్తయిందని తెలిపారు. అపార్ట్‌మెంట్ కుటుంబాలను కలుపుకొని అనేక సమస్యలపై పోరాటం చేశామని చెప్పారు. అందులో ప్రధానమైనది చెత్త పోరాటం అన్నారు. ఈ పోరాటంలో విజయం సాధించినట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లలో అపార్ట్‌మెంట్ల అభివృద్ధి పనులు, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సహకరించిన తోటి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం కమిటీకి అందించి సమైక్య స్ఫూర్తిని చాటుకుందామన్నారు. కార్యదర్శి నివేదికను గత కార్యదర్శి తవిటయ్య చదివి వినిపించారు.

# ఫార్మర్ పోర్టల్‌లో పేర్లు నమోదు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి నిడిగట్టు రైతు సేవా కేంద్రంలో ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్, తాజా 1 బి, ఆధార్ జెరాక్స్ ప్రతులను తీసుకెళ్లి పలువురు రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా ఆధార్ సంఖ్య మాదిరిగానే 14 అంకెలతో కూడిన నిర్దిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఎటువంటి రాయితీలు పొందాలన్నా వ్యవసాయ భూమి ఉన్న రైతులు సంబంధిత పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.



జివిఎంసి నాలుగో వార్డు నిడిగట్టులో ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

### రైతు నమోదును పరిశీలించిన ఎఒ

పద్మనాభం: మండలంలోని మద్ది, అనంతవరం, తునివలస, నేరెళ్లవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం మండల వ్యవసాయ అధికారి బివి.చలం పరిశీలించారు. రైతుల ఆధార్, భూమి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ గౌస్, విఎలు, విహెచ్‌ఎలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

ప్రజాశక్తి -గాజువాక : ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. విశాఖ జిల్లా (రూరల్) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం గాజువాకలోని గుండా గురుమూర్తి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి కమిటీ కృషిచేయాలని సూచించారు. రాజకీయంగా ఎదిగేందుకు వైశ్యులు ముందుకు రావాలని కోరారు. కల్యాణమండప సమస్యను ఆర్యవైశ్య నాయకులు టిజి.వెంకటేష్ ఆధ్వర్యాన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గంచే ప్రమాణం చేయించారు. జిల్లా అధ్యక్షులుగా బెల్లాల పెంటబాబు, కార్యదర్శిగా గునిశెట్టి అప్పలసత్యనారాయణగుప్తా, కోశాధికారిగా కట్టా సత్యానందం, యువజన సంఘం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా కందుల సాయి సత్యనారాయణ, కార్యదర్శిగా రెంటాల సుధాకర్, కోశాధికారిగా కోట్ల గుప్తా, మహిళా సంఘం, సేవాదళ్, వివిధ కమిటీల సభ్యులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కారుమూరు మహేష్, పిపిఎస్.నాగేశ్వరరావు, గుంపిన రఘునాథగుప్తా, రాష్ట్ర జిల్లా కమిటీ ప్రతినిధులు, ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చందనాడ గ్రామంలో ఆదివారం కోడిపందాల శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ దాడుల్లో ముగ్గురు పందెం రాయుళ్ల పై కేసు నమోదు చేసి, వారి వద్ద నుండి రెండు కోడి పుంజులు, 1310 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

### వ్యాయామ ఉపాధ్యాయుడు అరెస్ట్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు కే.నూకరాజు మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని చెప్పారు.

### వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : పెందుర్తి బిసి.కాలనీకి చెందిన మెతి అప్పన్న (50) అదృశ్యమైనట్లు ఆనందపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మెతి అప్పన్న ఈ నెల 9వ తేదీన చిలక జోస్యం చెప్పడానికి ఆనందపురం వచ్చారు. బిపి కళ్లాల్లో ఒక షాపు వద్ద జ్యోతిష్యం చెప్పినట్లు స్థానికులు గుర్తించారు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీపంలోనూ, బంధువులు ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లేకపోవడంతో చివరగా ఆనందపురంలో కనబడటంతో కుమారుడు రాజు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అప్పన్న చామనఛాయ రంగు, మాసిన గెడ్డంతో ఉన్నాడు. షాపులకు నిమ్మకాయలు కట్టడం, జ్యోతిష్యం చెబుతూ కోయి వేషధారుడిగా, కాషాయ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, ముస్లిములాగా తల మీద టోపీ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఆచూకీ తెలిసిన వారు సిఐ -7382296908, ఎస్ఐ 80746 66828 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## ప్రభుత్వ భూములను ప్రజావసరాలకు వినియోగించాలి

ప్రజాశక్తి-మధురవాడ : విశాఖ రూరల్ మండలంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారులను విచారించాలని, నలుగురు డిప్యూటీ కలెక్టర్లతో సహా ఏడుగురు అధికారులకు జాయింట్ కలెక్టర్ నోటీసులు ఇచ్చి ఈనెల 22న విచారణకు హాజరుకావాలని ఆదేశించారని తెలిపారు. కొమ్మాది, ఎండాడలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారంపై ఆదివారం పైడిరాజు ఒక ప్రకటన విడుదల చేస్తూ సిపిఐ గత 10 సంవత్సరాల నుంచి వీటిపై జిల్లా ఉన్నత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సక్రమంగా విచారించి అందుకు బాధ్యులైన భూ కబ్జాదారులపైనా, వారికి అన్నివిధాలా సహకరించిన రెవెన్యూ అధికారులపైనా చట్ట పరంగా తగు చర్యలు తీసుకొని, విలువైన భూములు కాపాడాలని కోరారు.

## సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి- తగరపువలస : రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేసిన దామోదర సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకమని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు అన్నారు. భీమిలి మండలం తాళ్లవలస ఎస్‌సి.కాలనీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, సంజీవయ్య తొలి దళిత ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నీతి నిజాయతీగా పనిచేసి నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని తెలిపారు. ఎస్‌సి, బిసిల రిజర్వేషన్ శాతాన్ని పెంచారన్నారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షులు బోని సన్నిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనర్ ఎంవి.శివ, జిల్లా అధ్యక్షులు కెవి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

## ఘనంగా శారద సుబ్రహ్మణ్య నటరాజన్ అయ్యర్ శత జయంతి

ప్రజాశక్తి -సీతమ్మధార : తమిళనాట పుట్టి తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి, సాహిత్య చిరంజీవి శారద సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్ అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సుబ్రహ్మణ్య నటరాజన్ అయ్యర్ శత జయంతి సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తమిళనాడులోని పుదుక్కోటిలో జన్మించిన శారద సుబ్రహ్మణ్య నటరాజన్ 12 ఏళ్ల వయసులో వృద్ధుడైన తన తండ్రితో బతుకు తెరువుకోసం 1937లో ఆంధ్రాలోని తెనాలికి వచ్చారని తెలిపారు. శారద మద్రాసులో చదివింది ఏడవ తరగతి అయినప్పటికీ, తెనాలి సమాజాన్నే తెలుగు విశ్వవిద్యాలయంగా చేసుకుని భాషపై పట్టు సాధించి వందకుపైగా కథలు రాసారని తెలిపారు. ఒకవైపు మూర్ఛవ్యాధి, మరోవైపు ఆకలి బాధలో సైతం తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కె.శరత్ చంద్ర సంపాదకత్వంలో ప్రచురించిన శారద కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ, తన తల్లి ద్వారా శారద కథలకు, సాహిత్యానికి దగ్గరయ్యానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, శరత్ చంద్ర, జెపి.శర్మ పాల్గొన్నారు.


జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

## జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 56వ వార్డులో పెంటకోట శివ ఆధ్వర్యాన సుమారు 400 మంది జనసేన పార్టీలో చేరారు. జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, అంగా ప్రశాంతి పార్టీ కండువాను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, 400 మంది జనసేన పార్టీలో చేరడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఒక్కరూ పవన్ కళ్యాణ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిందిగా కోరారు. అనంతరం అంగా ప్రశాంతి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసేవారికి గౌరవం కల్పిస్తామని, పార్టీ నియమావళికి కట్టుబడి అందరూ ఉండాలని చెప్పారు. పెంటకోట శివ మాట్లాడుతూ, వార్డులో అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళలు నమ్మి గీత, యమున, కిరణ్, మౌళి, చదరం సూర్యకాంతం, నమ్మి ఉష, ఈగల భాను, పైడిరాజు, పెంటకోట వెంకటలక్ష్మి, పోలమరిశెట్టి పద్మ, సర్వసిద్ధి సుజాత, పెంటకోట మంగ, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## 80 మందికి హోమియో మందులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విగ్గీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి హోమియో మందులు అందజేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గెడ్డంతా పూడికలే


గెడ్డల్లో పెరిగిన మొక్కలు

- వ్యర్థాలతో దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న రామచంద్రనగర్ ప్రజలు

ప్రజాశక్తి -గాజువాక

జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గెడ్డ పూడికతో నిండిపోయింది. గెడ్డలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. దానికి తోడు వ్యర్థాలను కూడా గెడ్డలో వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఈ గెడ్డకు ఆనుకొని ఉన్న రామచంద్రనగర్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గెడ్డ గుండా 14 గ్రామాల మురుగునీరు, వర్షపు నీరు ప్రవహిస్తోంది. విశాలమైన ఈ గెడ్డలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో దోమలు కూడా వృద్ధిచెందాయి. విష సర్పాలు కూడా చేరి ఒక్కోసారి గ్రామంలోకి వస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

గత వైసిపి ప్రభుత్వంలో పూడికలతీత కోసం రూ.20 లక్షలు మంజూరు చేశారు. వారం రోజులు కూడా పనిచేయకుండానే నిధులన్నీ అయిపోయాయని సగంలోనే పనులు వదిలేశారు. వెంటనే గెడ్డలో పూడికలు తీయించకపోతే, చిన్నపాటి వర్షానికి కూడా కాలనీలోకి నీరు వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్కన డంపింగ్ యార్డ్ దుర్వాసన, మరొకపక్క గంగవరం పోర్టు కాలుష్యం రామచంద్రనగర్, స్వతంత్రనగర్, గాంధీనగర్, ఎస్‌టి.కాలనీ, బర్మా కాలనీ, డెయిరీ కాలనీల ప్రజలు తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఇప్పటికే సొంత ఇల్లు వదిలి బయటికి వెళ్లే పరిస్థితి ఆ గ్రామాల్లో ఉంది. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### వర్షాలు పడితే ఇబ్బందులు

గెడ్డలో పూడికలు తీయకపోవడం వల్ల వర్షాలు పడితే ఇబ్బందులు తప్పవు. కాలనీలోకి నీరు చేరుతుంది. విశాలమైన గెడ్డ కావడం వల్ల రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను వేస్తున్నారు.


వి.నారాయణరావు, రామచంద్రనగర్

### దోమలు పెరుగుతున్నాయి

గెడ్డలో పూడికలు తీయకపోవడంతో రాత్రి సమయంలో దోమలు, విష సర్పాలు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో సగం వరకు పూడిక తీత పనులు చేసి మధ్యలో విడిచిపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి పూడికలు తొలగించాలి


డి.రమణ, రామచంద్రనగర్

# లేబర్ కోడ్స్‌పై ఉద్యమించాలి

## సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌పై కార్మికులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు చెప్పారు. విశాఖ డెయిరీ కార్మికులతో ఆదివారం సమావేశమై లేబర్ కోడ్స్, చట్టాలపై వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2019వ సంవత్సరంలో లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. ఇది చాలా ప్రమాదకరమన్నారు. కార్మిక హక్కులపై దాడి లాంటిదన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి వాటిని యాజమాన్యాలు అమలు చేయాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి సాహసించలేదన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశంలో ఏప్రిల్ నెలలో లేబర్ కోడ్స్‌ను అమలు చేస్తామని చెప్పారని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 18వ తేదీన 11 కార్మిక సంఘాలు ఏ విధంగా ఉద్యమాలు చేయాలనే నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న కార్మికులకు దీని నష్టాలను తెలియజేయాలని కోరారు. లేబర్ కోడ్స్ వల్ల యజమానికి లాభం, కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. విశాఖ డెయిరీ కార్మికులు ఐక్యమత్యంతో పోరాడి విజయం సాధించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెఎం.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, ఎన్.రాజేంద్రప్రసాద్, విశాఖ డెయిరీ సిఐటియు నాయకులు ఎం.రమణ, మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఫుట్ ఓవర్లు

ప్రజాశక్తి-పెందుర్తి : నాయుడుతోట నుంచి పెందుర్తి వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మించినప్పుడు ప్రజల నడక మార్గం కోసం 94వ వార్డు పరిధి కృష్ణానగర్, 97వ వార్డు చినముసిడివాడ వద్ద ఫుట్ ఓవర్లు నిర్మించారు. సుమారు పదేళ్లు దాటినా నేటికీ వినియోగంలోనికి రాలేదు. తుప్పు పట్టడంతో రెండుసార్లు పెయింటింగ్ వేశారు. వీటి లైట్లు మరమ్మతులకు గురైతే వాటిని కూడా వేశారు. కానీ వినియోగంలోకి తేవడంలేదు. అసలు ఇవి ఎందుకు నిర్మించారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఫుట్ ఓవర్ల ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పుట్టినరోజులు, వారికి శుభాకాంక్షలు తెలిపే బ్యానర్లు కట్టుకోవడానికి ఉపయోగపడుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఫుట్ ఓవర్లపై మందుబాబులు తాగి పడుకుంటున్నారు. ప్రజాధనాన్ని వృథా చేయకుండా వాటిని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



## కష్టపడిన వారికి ఉన్నత స్థానం

ప్రజాశక్తి-సీతమ్మధార : కష్టపడిన వారికి జనసేనలో ఉన్నత స్థానం ఉంటుందని, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తనకు హైకోర్టు అదనపు ఎడిషన్ జనరల్ బాధ్యతలు అప్పగించడమే ఉదాహరణ అని ఎస్.సాంబశివప్రతాప్ తెలిపారు. సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, జనసేన అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎడిజె సాంబశివప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, రాష్ట్ర లీగల్ సెల్ జనరల్ కౌన్సిల్ అశ్విని, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ అంగ ప్రశాంతి, ఉత్తరాంధ్ర లీగల్ సెల్ అధ్యక్షులు ఎస్.సుబ్రమణ్యం, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రామజోగేశ్వరరావు, వైజాగ్ కౌన్సిల్ అధ్యక్షులు బి.సత్యనారాయణ, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రేవతి తదితరులు పాల్గొన్నారు.

## 22 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పెదగదిలి శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు కోల బంగారయ్య తెలిపారు. ఈ మేరకు ఆలయంలో ఆహ్వాన పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 22వ తేదీన ఉత్సవ మూర్తుల తిరువీధి పల్లకి, మేళతాళాలు గరిడీలు, తప్పెటగుళ్లు కోలాటంతో ఊరేగింపు, నీళ్లతో స్వామివారికి అభిషేకం జరుగుతుందన్నారు. 23వ తేదీన శివపార్వతుల కల్యాణంతో పాటు మహా అన్నసమారాధన ఉంటుందన్నారు. 26వ తేదీన ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ధూళి రఘు, చల్లా రాజు, పాతేర్రు శ్యామ్, బొట్టా రమణ పాల్గొన్నారు.

# పాఠశాల పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

**ప్రజాశక్తి -కశింకోట :** పాఠశాల పారిశుధ్య కార్మికుల వేతన బకాయి చెల్లించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ .శంకరరావు , జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం కశింకోటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ వర్కర్లకు ప్రతి నెలా సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. వీరికి కనీస వేతనాలు వర్తింపజేయాలని, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ప్రతి 50 మంది పిల్లలకు ఒక శానిటేషన్ వర్కర్ నియమించాలని కోరారు. అనారోగ్యం, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వీరికికనీసం ఆసుపత్రికి వెళ్లడానికి కూడా సెలవు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు.

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పాఠశాలలో విధి నిర్వహణలో పాఠశాలలోనే పారిశుధ్య కార్మికురాలు మృతి చెందితే ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదనివిచారాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సునీత, సింహాచలం, రమణమ్మ, అప్పల నరసమ్మ, లక్ష్మీ, శానిటేషన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మీడియాపై అధికార దుర్వినియోగం తగదు

**ప్రజాశక్తి- అనకాపల్లి :** అక్రమాలపై కథనాలు ప్రచురించిన లీడర్ పత్రిక అధినేత రమణమూర్తికి విశాఖ ఆర్‌డిఒ శ్రీలేఖ నోటీసులు ఇవ్వడం తగదని, తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు అధ్యక్షతన ప్రజాసంఘాల ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్రమాలపై వార్తలు రాస్తే నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. తక్షణమే నోటీసులు వెనక్కు తీసుకోవాలని, ఆమెను బదిలీ చేసి, దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల భూములపై పోరాడుతున్న పత్రికకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ దొరబాబు, సూదికొండ మాణిక్యాలరావు, బొట్టా చిన్ని యాదవ్, గుడాల సత్యనారాయణ ముదిరాజ్, తుట్ట రమణ, ఆడారి బుచ్చి రాము, కట్టుమూరి మంగరాజు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, వియ్యపు రాజు,బొడ్డు సోమరాజు, కొల్లి చిన్న అప్పారావు, కనిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

### నోటీసులు వెనక్కి తీసుకోవాలి

**నర్సీపట్నం టౌన్:** 'లీడర్' రమణమూర్తికి ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర నాయకులు సిహెచ్‌బిఎల్.స్వామి ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రశ్నించడం పత్రికల ధర్మమని పేర్కొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి -అనకాపల్లి :** ఎఎంఎఎల్ కళాశాల 1981–84 డిగ్రీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని హోటల్ సన్ కాస్టిల్‌లో జరిగింది. నాలుగు దశాబ్దాల క్రితం ఇక్కడ డిగ్రీ చదువుకుని, వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులందరూ సతీ సమేతంగా హాజరై ఉల్లాసంగా గడిపారు, పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగం చేసుకొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సరిసా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ,కర్ణాటక తదితర ప్రాంతాలలో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా దంపతులకు భీమిలి చిన్నజీయర్ స్వామి వారి వారిజ ఆశ్రమానికి చెందిన వేదపండితులతో కర్పూర మాలలు, శేషవస్త్రాలు వేయించి ఆశీర్వచనాలు చేయించారు. అందరికీ జ్ఞాపికలు అందజేశారు



నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వమిత్రులు

ఉపాధ్యాయులుగా, రెవెన్యూ పోలీస్, వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్నతాధికారులుగా విధులు నిర్వహిస్తున్న వారు సైతం తమ హోదాలను మర్చిపోయి ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.రంగబాబు (ఎల్ఐసి) వేగి వెంకటరావు, కాళ్ళకూరి శ్రీనివాస్, విల్లూరి రెడ్డమ్మ నాయుడు తదితరుల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు దంపతులను పూర్వవిద్యార్థులంతా ఘనంగా సత్కరించారు.

## 18న దుర్గమాంబ తీర్థం

**ప్రజాశక్తి- సబ్బవరం :** సబ్బవరం మేజర్ పంచాయతీ ప్రజల ఆరాధ్యదైవం దుర్గమాంబ తీర్థ మహోత్సవాన్ని ఈనెల 18న మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. తీర్థం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామి గరిడిలు, చిటికెల భజనలు, మహిళల కోలాట ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లతోపాటు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. సబ్బవరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తీర్థంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కేంద్ర బడ్జెట్‌పై నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం ప్రజాసంఘాల నేతలు

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** కేంద్రబడ్జెట్ వల్ల సాదారణ ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని సిపిఎం నేతలు ధ్వజమెత్తారు .ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా అచ్యుతాపురం జంక్షన్ లో నిరసన చేపట్టారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్ రాము మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ వంటి పథకాలకు బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం కేటాయింపులు తగ్గించిందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై కోత అన్యాయమన్నారు. నిరసనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు కె.రామ సదాశివరావు, అచ్యుతాపురం శాఖ కార్యదర్శి కె సోమునాయుడు, గూడూరు వరలక్ష్మి పాల్గొన్నారు.

## 72 మందికి ఉచిత కంటి పరీక్షలు




కంటి పరీక్షలు చేస్తున్న లావణ్య, అరుణ

**ప్రజాశక్తి- కశింకోట :** మండలంలోని తాళ్లపాలెం రామాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణాసంస్థ సౌజన్యంతో టిడిపి మండల అధ్యక్షులు కాయల మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యులు డాక్టర్ అరుణ, డాక్టర్ శంకర్ పాల్గొని 72 మంది కంటి రోగులకు పరీక్షలు చేశారు. వీరిలో అంతరకుసుమాలున్న 20 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అప్పికొండ అప్పారావు, సంతోష్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం అరుణ్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది లావణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి ప్రాధాన్యత

**ప్రజాశక్తి -వడ్డాది :** మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి జనసేన తరపున కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు అన్నారు. సంబంధిత మంత్రులు, ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లి, చోడవరం నియోజకవర్గ జనసేన లక్ష్యాలో ప్రధానమైన మంగళాపురం ఆనకట్ట శాశ్వతమైన నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తద్వారా సాగుకు దూరమైన ఏడు వేల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.



రైతులతో కలిసి మంగళాపురం ఆనకట్ట పరిశీలిస్తున్న రాజు

ఆదివారం జనసేన ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, స్థానిక రైతులు ఆనకట్టను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఆనకట్ట స్థితిగతులను పరిశీలించి, స్థానిక రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎడమ కాలువ వైపు భూమి కోతకు గురికావడంతో సాగునీరు వృథాగా పోతున్నట్లు గుర్తించారు.

ఈ సందర్భంగా స్థానిక రైతులు సాగునీటి సమస్యను రాజుకు వివరించారు. ఆరేళ్లుగా ఆనకట్ట కుడి,ఎడమ కాలువల నుంచి నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో పది గ్రామాలకు చెందిన ఏడు వేల ఎకరాలకు నీరు అందక పంటలు పండని పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న తామంతా తీవ్ర ఇబ్బందులకు నెట్టబెడ్డామని వివరించారు. ఆనకట్టలో నీటి నిల్వ లేకపోవడంతో వాటి ప్రభావంతో భూగర్భజలాలు కూడా అడుగంటిపోయి సీజన్‌లో తాగునీటికి కటకట తప్పడం లేదని విన్నవించారు. ప్రస్తుతం సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ, వాటి వల్ల పూర్తి ప్రయోజనం చేకూరదని, ప్రభుత్వం స్పందించి శాశ్వత ప్రాతిపదికన మంగళాపురం ఆనకట్టను పటిష్టంగా పునర్నిర్మించాలని కోరారు.

దీనిపై పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణానికి గత ప్రభుత్వంపైనా ఒత్తిడి తెచ్చిఆన అప్పట్లో కనీసం స్పందించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా జనసేన ఉండడంతో దీన్ని సీరియస్‌గా తీసుకుని పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి వినతిపత్రాన్ని అందజేశానన్నారు. సంబంధిత అధికారుల పరిశీలనలో ఉందన్నారు. ప్రస్తుతం క్షేత్రస్థాయి పర్యటనలో ఆయకట్టు రైతులు, స్థానిక ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సమస్యలను మరోమారు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతామన్నారు.

మంగళాపురం ఆనకట్ట పునర్నిర్మాణం నియోజకవర్గ జనసేన ప్రాధాన్యతా అంశమని, దీనికోసం రైతుల పక్షాన జనసేన ఎల్లప్పుడూ ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డిఎస్ నాయుడు ,మైచర్ల నాయుడు , బలిజ మహారాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామ అప్పారావు, కర్రి రమేష్, సీనియర్ నాయకులు కర్రి తమ్మి నాయుడు, ఆనకట్ట చైర్మన్ కర్రి రాజారావు, శనివాడ నాయుడుబాబు, తుమ్మపాల రమేష్ ,కసింకోట మాణిక్యం ,దొండా సాయి ,బాలకృష్ణ , బొబ్బిలి నాయుడు, చింతల కిషోర్, సోమిరెడ్డి శివశంకర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పాల సేకరణ కేంద్రం ప్రారంభం



పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

**ప్రజాశక్తి -అచ్యుతాపురం :** మండలంలోని హరిపాలెం గ్రామంలో ఆదివారం హెరిటేజ్ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ఎం సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె శేషు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ డెయిరీ సేవలు అందిస్తుందన్నారు. పాడిరైతులకు డెయిరీ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. రైతులకు ప్రమాద బీమాతోపాటు బోనస్‌లు, పాడిరైతుల కొనుగోలుకు రుణాలు, ఇతర ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె జగ్గారావు, కె శ్రీనివాసరావు, కె రామ అప్పారావు, కె.మహేష్, మహిళలు పాల్గొన్నారు.

## పూడుకుపోయిన కాలువలతో పరేషాన్!

### ముందుకు కదలని మురుగునీటితో అవస్థలు



కాలువల్లో పూడుకుపోయిన చెత్త

**ప్రజాశక్తి-చోడవరం రూరల్:** మండలంలో గాంధీ గ్రామ్ పంచాయతీ శాంతినగర్ కాలనీలో విజ్ఞాన్ స్కూల్ దగ్గర కొత్తగా నిర్మించిన కాలువ గుండా మురుగునీరు పోకుండా చెత్త అడ్డంగా ఉండి పోవడంతో దుర్వాసన, దోమల ఆవాసంగా మారి ఇబ్బందు లకు గురి చేస్తోందని స్థానికులు వాపోతు న్నారు. జనావాసాల మధ్య ఉన్న కాలువలోని ముందుకు పోని పరిస్థితుల్లో చేరిన చెత్తంతా కుళ్లిపోయి స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించడం లేదని పట్టణానికి చెందిన మహిళా అధ్యక్షురాలు నరవ సరోజిని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టకుంటే జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని సరోజిని అంటున్నారు.

## 18న పైడిమాంబ పండగ

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట** : మండలంలోని చిన్నప్పన్నపాలెంలో పైడిమాంబ పండుగను ఈ నెల 18న మంగళవారం నిర్వహిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ కోవెల నాగమణి తెలిపారు. ఏటా మాఘ పౌర్ణమి తర్వాత పైడిమాంబ పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తున్నా మన్నారు. పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, రాత్రి వేళ వినోదానికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.
కాగా పైడిమాంబ ఆలయం చాలా చిన్నదిగా ఉండడంతోపాటు శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో రూ.60లక్షల విరాళాలను సేకరించి, ఆలయాన్ని అత్యద్భుతంగా నిర్మించా మన్నారు. ఈ ఏడాది కొత్తగుడిలోనే పైడిమాంబ వేడుక నిర్వహి స్తామన్నారు. ఉత్సవం సందర్భంగా గుడిచి విద్యుద్దీపాలతో అలంకరించారు.

## నల్ల మారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



నల్ల మారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న భరత్‌కుమార్

**ప్రజాశక్తి- అనకాపల్లి :** మండలంలోని పిసినికాడ పంచాయతీ బిఆర్‌టి కాలనీ నల్లమారమ్మ తల్లి జాతర పోస్టర్‌ను వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలో రింగరోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు ముందుగా ఉత్సవ ఆహ్వాన పత్రికు మలసాల భరత్ కుమార్‌కు ఉత్సవ కమిటీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలోఉత్సవ కమిటీ సభ్యులు, బిఆర్‌టి కాలనీ వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లం ఊటలు ధ్వంసం

**ప్రజాశక్తి గంగవరం :** గంగవరం మండలంలో కొండలంపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటు సారా బట్టిపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో, నాటుసారా తయారీకి డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 450 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, దాడుల సమయంలో నాటుసారా బట్టీల వద్ద ఎవరూ లేరన్నారు. సారా బట్టీలను ఎవరు నిర్వహిస్తున్నారో దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు. మండల పరిధిలో ఎవరైనా నాటు సారా బట్టీలు నిర్వహించినా, నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవనిహెచ్చరించారు.

# అలంకారప్రాయంగా సంపద కేంద్రం

- లక్షల్లో ప్రభుత్వ నిధులు చెత్త పాలు
- పేడను తెచ్చి సేంద్రియ ఎరువుగా చూపే యత్నం
- అధికారుల గారడీతో ప్రజల విస్మయం

**ప్రజాశక్తి-పరవాడ** : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు, పంచాయతీలకు ఆదాయం రాబట్టడానికి ప్రభుత్వాలు లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. గ్రామాల్లో రోజువారీ విడుదలయ్యే చెత్తను సేకరించి ఆ కేంద్రాలకు తరలించి, అక్కడ సంపద సృష్టించాలన్నది లక్ష్యం. పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన ఆ కేంద్రాలను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో గ్రామాల్లో రోడ్ల వెంట, చెత్త సంపద తయారీ కేంద్రాల వద్ద చెత్త కుప్పలుకుప్పలుగా పేరుకుపోతోంది. ఆశయం కాస్తా అటకెక్కిపోతోందనే విమర్శలున్నాయి. గొర్లివానిపాలెం పంచాయతీలో చెత్తసంపద తయారీ కేంద్రం చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఘనవ్యర్థాల నిర్వహణ ద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు, ప్రభుత్వ ప్రోత్సాహం పొందేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. చెత్తనుండి సంపదను తయారు చేయడానికి కంపోస్టింగ్, పునర్వినియోగం వంటి విధానాలు ద్వారా చెత్తనుండి సంపద తయారీ చేస్తారు. చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి, తడి చెత్తతో ఎరువు తయారు చేస్తారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్, కాగితాలు, ఇనుము వంటి వాటిని పునర్వినియోగిస్తారు. వేరు చేసిన చెత్తలో కుళ్ళిపోని ఘన వ్యర్థాలను కొత్త వస్తువులుగా చేస్తారు. అసలు వస్తువులకు అనుకరించి లేదా మరో రకం కొత్త వస్తువును ఉత్పత్తి తయారీకి ముడి సరుకుగా ఉపయోగిస్తారు.



సంపద కేంద్రంలో ఖాళీగా ఉన్న తడిపొడి చెత్తను వేరు చేసే గదులు



వేరొక చోట నుంచి సంపద కేంద్రానికి తెచ్చిన పేడ ఎరువు



సంపద కేంద్రం వద్ద కానరాని చెత్త

చెత్త సంపద కేంద్రాలు గ్రామాల్లో సేకరించే తడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, అక్కడ సేంద్రియ ఎరువుగా తయారు చేస్తారు. తయారు చేసిన ఎరువును రైతులకు విక్రయిస్తారు. వచ్చిన ఆదాయంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనేది లక్ష్యం. మండలంలోని గొర్లివానిపాలెం గ్రామం పంచాయితీ పరిధిలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఈ తతంగం అంతా ఎవరు పడతారు అనుకున్నారో? ఏమో కానీ, పశువుల పేడ గెత్తం ఎరువును తీసుకుని వచ్చి, సంపద కేంద్రాల్లో వేసి ఇక్కడ చెత్త నుండి సంపద సష్టిస్తున్నట్లు చూపించడానికి అధికారులు ఆపసోపాలు పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

గొర్లివానిపాలెం పంచాయతీలో కొత్త గొర్లివానిపాలెం, చింతల గొర్లివానిపాలెం, పాతగొర్లివానిపాలెం, దిబ్బల గొర్లివానిపాలెం, గొర్లివానిపాలెం కాలని, బసవతారక రామ్ నగర్, ఫోర్టుకో, తదితర గ్రామాల నుండి రోజుకు వందల కిలోల కొద్దీ చెత్తను సేకరించి అలా సేకరించిన చెత్తను తడి, పోడి చెత్త వేరుచేసి చెత్త నుండి సంపద సష్టించాలి, పంచాయతీ అధికారులు అలా చేయకుండా నామమాత్రంగా చెత్త సేకరణ చేపట్టి, మిగతా చెత్తను తోచిన చోట్ల విడిచి వెళ్తున్నారని పంచాయతీ ప్రజలు నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గ్రామాల నుండి సేకరించి తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించి చెత్త ద్వారా సంపద సష్టించాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

## కస్తూర్బా విద్యాలయంలో భద్రత పరిశీలన



పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

**ప్రజాశక్తి -మునగపాక:** మండలంలోని పాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆదివారం స్థానిక ఎస్ఐ పి ప్రసాదరావు సందర్శించారు. పాఠశాలలో భద్రతపై పరిశీలించారు. హాస్టల్లో కాంపౌండ్ వాల్, వాటికి అమర్చిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. విద్యార్థినులతో మహిళా కానిస్టేబుళ్లను మాట్లాడించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యాలయ ఆవరణలో పది సిసి కెమెరాలు ఏర్పాటు తర్వాత ఇబ్బందులు లేవని పాఠశాల యాజమాన్యం చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాదరావు మాట్లాడుతూ కస్తూర్బా హాస్టల్ పరిసరాల్లో ఎవరైనా ఆకతాయిలు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని సూచించారు. కస్తూర్బాలో సమస్యలపై విద్యార్థులతోపాటు ఎస్ఓ, ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేష్, మహిళా కానిస్టేబుల్ రమాదేవి పాల్గొన్నారు.

## 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కర్

**ప్రజాశక్తి -వడ్డాది :** ప్రతి విద్యార్థి గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని బుచయ్యపేట ఎస్ఐ ఎన్ భాస్కర్ అన్నారు. ఆదివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాది కస్తూరిబా విద్యాలయంలో విద్యార్థులకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు ఎక్కువైపోయాయని, వాటినిఎదుర్కొనే శక్తి సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. రాత్రి వేళల్లో ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు బాలికలు వాటి నెంబరు, రూట్‌ను కుటుంబ సభ్యులకు లేదా స్నేహితులకు షేర్ చేయాలని సూచించారు. పాఠశాలల్లో, పని ప్రదేశాల్లో, ఇంకెక్కడైనా బాలికలు, మహిళలను కించపరిచినా, వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్‌కు పాల్పడినా దగ్గరలో ఉన్న పోలీసులకు గానీ, పోలీసులు టోల్ ఫ్రీ నెంబర్లకు గాని తెలియచేయాలని సూచించారు కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ ఎడ్ల సత్యవేణి, వైస్ చైర్మన్ దొంకిన శ్రీనివాసరావు, ఎడ్ల రామ్మూర్తి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

## ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : మండలంలోని మేడిచర్ల గ్రామంలో ఆదివారం భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్వామిని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించు కున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం రెండు గంటల నుంచి జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు మహిళలకు కోలాటం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పూడి నారాయణమూర్తి, పూడి శ్రీనివాసరావు, బొడ్డు తాతయ్య బాబు, జూరెడ్డి రాము, రొంగలి మహేష్.పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవ కమిటీ ఏర్పాటు

**ప్రజాశక్తి -సీలేరు:** సీలేరు ఉమామహేశ్వర ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎపి జెన్కో ఎస్ఇ (సివిల్స్) చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇఇ ఎన్ శ్రీనివాస్ రెడ్డి, విష్ణుకుమార్ కార్యదర్శిగా డి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఐనాడ శివ, సహాయ కార్యదర్శిగా జి లక్ష్మణ రావు, కెబిబి కార్యనిర్వహణ అధ్యక్షులుగా ఎం. పవన్ కుమార్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.ఉమ, సభ్యులుగా కోవిరి దేవి, పందిరి వరలక్ష్మి, దండుపాటి సత్య వతి, కొప్పోజు పైడేశ్వరి, కే రవి, వానపిల్లి అప్పారావు, పి మహేష్, సదరం సూరిబాబు, చిటికెలరాములను ఎన్నుకున్నారు.

# చికెన్ దుకాణాలు వెలవెల

## -బర్డ్‌ఫ్లూ భయంతో తగ్గిన అమ్మకాలు-నష్టాల్లో వ్యాపారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందన్న ప్రచారంతో చికెన్ షాపులు వెలవెలబోతున్నాయి. గత వారం పది రోజుల నుంచి కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందన్న ప్రచారం రావడంతో ప్రజలు భయందోళన చెంది, మాంసం దుకాణాల వైపు కన్నెత్తి చూడటం లేదు. గత కొద్ది రోజుల నుంచి చికెన్, గుడ్లు అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. బేరాలు లేక వ్యాపారులు విలవిలాడుతున్నారు. గతంలో కిలో చికెన్ రూ.240 నుంచి 250 వరకు విక్రయించేవారు. ప్రస్తుతం కిలో చికెన్ రూ 190 లకు పడిపోయింది. చికెన్ ధర తగ్గినప్పటికీ బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ కొనుగోలు చేసేందుకు జనం ముందుకు రావడం లేదు. ఆదివారం వస్తే జనం రద్దీతో కిటకిటలాడే చికెన్ షాపులు నేడు బోసిపోయాయి. వ్యాపారం సాగక వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. బర్డ్ ఫ్లూ భయంతో జనం చికెన్ కొనుగోలు చేయడం పూర్తిగా మానేశారు. చేపలు, మేక మాంసం కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో చేపలు మార్కెట్లు రద్దీగా కనిపిస్తున్నాయి.

వడ్డాది:ఆదివారం వచ్చిందంటే చికెన్ షాపుల వద్ద క్యూ కట్టే జనం వాటి జోలికి వెళ్లడం లేదు. బుచ్చయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో చికెన్ సెంటర్లు వెలవెల బోతుతున్నాయి. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు భయభ్రాంతులకు గురై చికెన్ తినడం మానేశారు. దీంతో చికెన్ వ్యాపారస్తులు డీలా పడ్డారు. గతంలో చికెన్ లైవ్ రూ.130 నుండి 150 రూపాయల వరకు ఉండేది. ఇప్పుడు వంద రూపాయల నుండి 80 రూపాయల వరకు ధర పలుకుతుంది. చికెన్ ధర గతంలో రూ.200 నుండి 250 వరకు ఉండేది. ఇప్పుడు రూ.180 నుండి 200 వరకు పలుకుతుంది. దీంతో చికెన్ వ్యాపారస్తులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. రోడ్డున పోయే వారిని పిలిచి చికెన్ అమ్మే పరిస్థితి ఏర్పడింది. హెూటల్, దాబాలకు కూడా వెళ్లటం తగ్గించారు. హెూటల్స్‌లో ఎక్కువగా చికెన్ లాలీపాప్, చికెన్ 65, చికెన్ జాయింట్లు, తందూరి చికెన్ ఇలా విభిన్న వంటకాలతో చికెన్ ప్రియులు ఇష్టంగా ఆరగించేవారు. బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రభావం హెూటల్లో కూడా కనిపిస్తుంది. వీటివైపు వెళ్లడం తగ్గించారు. ఇదిలా ఉండగా మటన్ దుకాణాలకు మంచి గిరాకీ ఏర్పడింది. మటన్ కేజీ ఎనిమిది వందల రూపాయలు నుండి 1000 రూపాయల వరకు ధర పలుకుతుంది. చేపలు కిలో 150 రూపాయలు నుండి 220 వరకు అమ్ముతున్నారు.



నక్కపల్లి, వడ్డాదిలో ఖాళీగా ఉన్న చికెన్ షాపులు



వాటర్ బాటిల్‌తో బహిర్భూమికి వెళ్తున్న వ్యక్తి

## బహిర్భూమికి నిలయంగా హైస్కూల్

ప్రజాశక్తి- కోటవురట్ల: ఓ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛతేహిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యక్రమాలు చేపడుతున్నారు. కానీ, మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ అపరిశుభ్యానికి అడ్డాగా మారిపోతుంది. పాఠశాల ఆవరణలో విశాలమైన క్రీడా మైదానంలో స్థానికులు కొంతమంది బహిర్భూమికి వెళ్తున్నారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం సమయంలో వాకర్స్ సహా క్రీడమైదానాన్ని ఉపయోగించుకుంటున్నారు. పరిసర ప్రాంతాలను అపరిశుభ్రంగా మారుస్తున్నా పాఠశాల సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల యదేచ్ఛగా క్రీడా మైదానంలో బహిర్భూమికి వినియోగించు కుంటున్నారు. నిత్యం బహిర్భూమికి వచ్చే వారికి అవగాహన కల్పించడం లేదా హెచ్చరించడం వంటి చర్యలు చేపట్టాలని పాఠశాల సిబ్బందిని క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.



స్టాలును పరిశీలిస్తున్న బృందం ప్రతినిధులు

## ప్రకృతి పంటలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- మాడుగుల:ప్రకృతి వ్యవసాయ సాగు పంటలను తినడంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని రైతు సాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో ముంబై రైతు సాధికార సంస్థ సంభోధి బృందం రైతులు పండించిన పంటలను పరిశీలించారు. మాడుగులలో స్టాల్సు చూశారు. ప్రకృతి వ్యవసాయం లో సాగు చేసి పండించిన పంటలు తినడంతో ఆరోగ్యంగా ఉండవచ్చుననన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నక్కపల్లిలో అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి గాంధీనగర్ కాలనీలో గణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హెూమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు.

## దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో ఆదివారం దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## నేల బావిలో పడి రైతు మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ బంగారయ్యపేట గ్రామ శివారులో నేల బావిలో పడి చిటికెల అప్పలనాయుడు అనే రైతు ఆదివారం మృతి చెందినట్టు నర్సీపట్నం రూరల్ ఎస్సై రాజారావు తెలిపారు. బావి వద్ద మోటార్ పంపుతో పొలాలకు నీళ్లు తోడుతూ ప్రమాదవశాత్తు నేల బావిలో పడి మృతి చెందినట్టు చెప్పారు. భార్య చిటికెల రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వివరించారు.

# టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

## - ఇళ్లకు వెళ్లి విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయుల ఆరా



గృహాన్ని సందర్శిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -రావికమతం:ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్న ఉద్దేశంతో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పర్యవేక్షణ చేయడం జరుగుతుందని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు, బి.మహాలక్ష్మి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, విద్యాశాఖ ఆదేశాల మేరకు మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించడం కొరకు మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, బి. అప్పలనాయుడు, భీంపల్లి ఎర్రయ్య, యు.పాపారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడులు విద్యార్థుల గృహాలకు వెళ్ళి, వారు ఎలా చదువుతున్నారో ఆరా తీశారు. అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, 10 వ తరగతి పరీక్షలు బాగా రాసేందుకు సమాయత్తం కావాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా , ఈ నెల రోజులు ప్రణాళిక బద్ధంగా, ఏకాగ్రత తో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు అందజేశారు. పదవ తరగతి లో మంచి ఫలితాలు సాధించుటకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.



చదువుతున్న విద్యార్థులు

## చోద్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చోద్యం రైతు సేవా కంద్రంలో మండల వ్యవసాయశాఖ అధికారి కే.సుధారాణి ఆధ్వర్యంలో ఆదివారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ వరకు మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్ కాకపోతే ప్రభుత్వ పథకాలు పొందలేరని చెప్పారు. రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.



రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయాధికారి

## గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి–గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమంను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నీతి కథలు చదివి వినిపించారు.

# బాలికపై విద్యార్థుల దాడి

## -అల్లూరి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి
## - వైరల్ అయిన వీడియో- విచారణ చేపట్టిన ఎంఇఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని సెయింట్ ఆన్స్ స్కూల్లోని బాలికల వసతి వసతి గృహంలో 7వ తరగతి చదుతున్న బాలికపై 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు భౌతిక దాడికి పాల్పడిన వీడియో ఆదివారం వైరల్ కావడంతో విద్యా శాఖాధికారులు స్పందిం చారు. డీఈవో పి.బ్రహ్మాజీరావు ఆదేశాల మేరకు ఎంఈవో ఎస్.విశ్వప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి పాఠశాల యాజమాన్యాన్ని విచారించారు. అయితే ఈ ఘటన గత నెల 5వ తేదీన జరిగినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందని ఈ విషయంపై డీఈవో బ్రహ్మాజీరావుకు నివేదికను అందించనున్నాయని ఆయన తెలిపారు. ఈ విషయంపై డీఈవో సోమవారం పాఠశాలను సందర్శించి సమగ్ర విచారణ చేపడ తారని ఆయన తెలిపారు. సెయింట్ ఆన్స్ స్కూల్లో చిన్న పిల్లలను పెద్ద పిల్లలు ర్యాగింగ్ చేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నట్లు వివిధ వాట్సాప్ గ్రూపుల్లో వీడియో వైరల్ కావడంతో స్పందించిన స్థానిక ఎమ్మెల్యే పాఠశాలకు చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ స్కూల్ యాజమాన్యం తీరు అధ్వాన్నంగా ఉందని ,గతంలో కూడా పలు అభియో గాలు వచ్చాయన్నారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులు ఫోన్‌లు వినియోగిస్తుంటే యాజమాన్యం ఏమి చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఘటనపై, యాజమాన్యం తీరుపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ లో ఇటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో తరచూ రకరకాల సంఘటనలు జరుగు తున్నా ప్రభుత్వ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. విద్యార్థులలో శ్రమ శిక్షణకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

## - ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

**ప్రజాశక్తి-పాడేరు:** నూతన విద్యా విధానాన్ని రద్దు చేసి, విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పిఎం ఆర్‌సిలో ఎస్ఎఫ్ఐ ప్రథమ జిల్లా మహాసభ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గత రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమలు చేసి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తీవ్ర నష్టాన్ని కలిగించి భ్రష్టు పట్టించిందన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేసిన నూతన విద్యా విధానాన్ని అమలు చేసినట్లయితే అనేకమంది గిరిజన విద్యార్థిని విద్యార్థులు చదువుకు దూరమై డ్రాప్స్ అవుట్స్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. నూతన విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. గిరిజన ప్రాంతంలో సరైన పౌష్టిక ఆహారం అందక కాలేజ్ హాస్టల్ విద్యార్థులు సుమారుగా ఈ సంవత్సరంలో 20 మంది రక్తహీనతతో చనిపోయారని తెలిపారు. గిరిజన విద్యార్థుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధయగా వ్యవహరిస్తూ చనిపోయిన విద్యార్థులకు న్యాయం చేయని దుస్థితిలో ఉందన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో హెల్త్ వర్కర్స్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థులను చదువుకు దూరం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంటనే విద్యార్థుల మరణాలను అరికట్టాలని, అల్లూరి సీతారామరాజు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వర్కర్స్ నియమించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

**నూతన జిల్లా కమిటీ ఎన్నిక**

అనంతరం మొదటి జిల్లా మహాసభలో ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ 17 మందితో ఎన్నుకున్నారు నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కార్తీక్ ,జీవన్ కృష్ణ ఎన్నికయ్యారు. ఈ జిల్లా మహాసభలు 11 మండలాల నుంచి మండల కమిటీల ప్రతినిధులు విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సన్నిబాబు

## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాశక్తి -నక్కపల్లి:** సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సన్నిబాబు సూచించారు. నక్కపల్లి గురుకులంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.మొబైల్ ఫోన్ ద్వారా అనేక నేరాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను కొందరు నేరగాళ్లు ఆసరాగా తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో కొందరు బాలికలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని, దీనిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేసినా, తప్పుడుగా ప్రవర్తించినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.ర్యాగింగ్, దిశా చట్టం, ట్రాఫిక్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.


నగదు అందజేస్తున్న యూనియన్ నేతలు

## మెకానిక్‌కు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** తమ తోటి మెకానిక్ అనారోగ్యం పాలవడంతో విజయ దుర్గా టూ వీలర్స్ అసోసియేషన్ తరపున తోటి మెకానిక్‌లు ఆదుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 8వ వార్డుకు చెందిన రెల్లి బాబ్జి అనే మెకానిక్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మతిస్థిమితం కోల్పోయాడు. ఈ వైద్యంకు తలకు మించిన భారం అయ్యింది. తన కష్టాన్ని తెలుసుకున్న తోటి మెకానిక్‌లు విజయ్ దుర్గా టూ వీలర్స్ అసోసియేషన్ తరపున 70 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సొమ్మును ఆదివారం యూనియన్ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పారావు, సభ్యులు బాబ్జి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేపాడ చిరంజీవి, బొండాడ లోవ, ఎం.సత్తిబాబు, మార్గాన రవి, బండారు చిరంజీవి, మందపల్లి చిట్టిబాబు, కైసర్ల మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పరుగు పెడుతున్న ఎడ్లు

## హోరా హోరీగా పోటీలు

**ప్రజాశక్తి-మాడుగుల:** మండలంలోని తాటిపర్తి పంచాయతీ ద్వారకా నగర్ గ్రామంలో ఆదివారం సీతారాముల తీర్థమహోత్సవంను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు, ఎడ్లబండ్ల పరుగు పోటీలు హోరాహోరీ జరిగాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## నేడు అనంతగిరి మండల సమావేశం

**ప్రజాశక్తి- అనంతగిరి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 17న సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఏవివి. కుమార్ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి. నీలవేణి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు.

# క్వీన్ మేరీ విగ్రహానికి హంగులు

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:** చారిత్రక స్మృతులకు ఖ్యాతినార్జించిన విశాఖ నగరంలో అలనాటి జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. నేటి తరానికి తెలియని అలనాటి అరుదైన జ్ఞాపకం వన్ టౌన్ పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో ఉన్న క్వీన్ విక్టోరియా కాంశ్య విగ్రహం. జివిఎంసి నిర్లక్ష్యం కారణంగా, గత కొన్నాళ్లుగా చుట్టూ మొక్కలు మొలిచి, కనిపించలేని పరిస్థితిలో విగ్రహం ఉండేది.

ఇటీవల పాత నగరం అభివృద్ధిలో భాగంగా జివిఎంసి కొన్ని పురాతన కట్టడాలను సంరక్షించి, పునరుద్ధరించే పనులను చేపట్టింది. అందులో భాగంగా క్వీన్ మేరీ విగ్రహ ప్రాంతమును కూడా అబివృద్ధి చేశారు. జగదాంబ జంక్షన్ నుంచి, పాత పోస్ట్ ఆఫీస్ వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల మేర వెడల్పు చేసి అభివద్ధి చేశారు. అందులో భాగంగా చారి దర్గా ప్రసిద్ధి చెందిన క్వీన్ విక్టోరియా కాంశ్య విగ్రహం ను కూడా అభివద్ధి చేశారు.పాడైన రాతి వేదికను,స్మారక మందిరాన్ని అందంగా రూపుదిద్దారు.రాణి బొమ్మ సెంటర్ గా పేరున్న ఈ ప్రదేశం ఇప్పుడు సుందరంగా కనిపిస్తోంది.

ఇక రాణి బొమ్మ చరిత్ర లోకి వెళితే, విశాఖపట్నం ఎస్టేట్ జమిందార్ అంకిత వెంకట జగ్గారావు తన ఇంగ్లాండు పర్యటనలో భాగంగా 1900 సంవత్సరంలో విక్టోరియా మహారాణిని కలిశారు. ఆ సందర్భంగా ఆయనను సన్మానించి బ్రిటిష్ ప్రభుత్వం విక్టోరియా మహారాణి కాంశ్య విగ్రహాన్ని విశాఖ నగరానికి కానుకగా బహుకరించింది.ఆ విగ్రహాన్ని అప్పటి నగరం నడిబొడ్డున ఉన్న పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో 1904 మే 24 న అప్పటి విశాఖపట్నం కలెక్టర్ ఆర్. హెచ్ క్యాంప్ బెల్ ప్రారంభించారు. పొడ ముచ్చటగా ఉండే ఆ విగ్రహం పోర్టు కాలుష్యం కారణంగా నల్లగా మారిపోయింది. విగ్రహం చేతిలో గోళం తో పాటు, మరో చేతిలో బ్రిటిష్ రాజదండం ఉండేదని, కాల గమనంలో రాజదండం కనిపించకుండా పోయిందని విశాఖపట్నం ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరావు తెలిపారు. ఎట్టకేలకు జీవీఎంసీ అధికారులు రాణి బొమ్మకు కొత్త హంగులు కల్పించి, పాత నగరానికి శోభనం తీసుకువచ్చారని చెప్పటంలో సందేహం లేదు.


మందిరంలో కొలువుదీరిన విగ్రహం

## రుషికొండ బీచ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రిషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో పనిచేస్తున్న 38 మంది ఉద్యోగులకు బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని విఎంఆర్‌డిఎ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా నగరంలో రిషికొండ బీచ్, బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిందని తెలిపారు. మూడు నెలల నుండి జీతాలు లేకపోతే కుటుంబాలూ ఎలా బతకాలని ప్రశ్నించారు.బకాయపడ్డ వేతనాలు చెల్లించండని అధికారులను అడిగితే ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు దిగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రతినెలా జీతాలు ఇవ్వకపోతే ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, పిల్లల ఫీజులు ఎలా చెల్లిస్తారన్నారు. పర్యాటక కేంద్రాల్లో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, టూరిజం రీజనల్ డైరెక్టర్, డివిజనల్ మేనేజర్ బెరంపులు ఆపి తక్షణం బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.


బోసిపోయిన చాపరాయి

## చాపరాయిలో తగ్గిన పర్యాటక సందడి

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో పర్యాటకుల తాకిడి తగ్గింది. కార్తిక మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి సెలవులు, మొదటి వారం వరకు పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించారు. రెండో వారం నుంచి పర్యాటకుల సందర్శన తగ్గింది. అడపదడప కొంతమంది సందర్శిస్తున్నారు తప్ప ఎక్కువమంది సందర్శిం చడం లేదు. పర్యాటకుల సందర్శన లేక చాపరాయి జలపాతం బోసిపోయింది.